## రేణుక ఎల్లమ్మదేవి ఆలయ వార్షికోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందిస్తున్న గౌడ సంఘం నేతలు

**నర్సాపూర్, జూన్ 17, ప్రభాతవార్త:** పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19 20 తేదీల్లో నిర్వహించే రేణుక ఎల్లమ్మ దేవి 15వ వార్షికోత్సవానికి గవర్నర్ శివప్రసాద్ శుక్లను గౌడ సంఘం సభ్యులు ఆహ్వానించారు. బుధవారం బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి చిన్న రమేష్‌గౌడ్, నాయకులు పెద్ద రమేష్‌గౌడ్, బిజెపి జిల్లా కోశాధికారి ఆంజనేయులుగౌడ్, నాయకులు రామకృష్ణగౌడ్ కలిసి హైదరాబాద్‌లోని గవర్నర్ నివాసానికివెళ్లి గవర్నర్ శివప్రసాద్‌శుక్లాను అంద జేశారు. వార్షికోత్సవ ఉత్సవాలకు తప్పకుండా రావాలని రాష్ట్ర గవర్నర్‌ను కోరారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

# వార్త

## రోడ్డు మరమ్మతులు చేపట్టండి.. ప్రమాదాలను నివారించండి
### ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

**న్యాల్‌కల్, జూన్ 17, ప్రభాతవార్త:**
నియోజవర్గంలో గుంతలమయంగా మారిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మండల పరిధిలోని ఖలీల్‌పూర్ గ్రామ శివారులో జహీరాబాద్-బీదర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను తప్పించబోయి సోమవా రం ఇద్దరు యువకులు ప్రమాదానికి గురి కాగా ఒక యువకుడు మృతి చెందాడని, మరో యువకుడు తీవ్ర గాయాలకు గురయినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గంలోని ఆర్ అండ్ బి, పిఆర్ రోడ్ల దుస్థితిపై శాసనసభలో మంత్రుల దృష్టికి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించు కోలేదని, ఫలితంగా తరుచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదంలో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి గుంతలు పడిన రోడ్డుపై మరమ్మతు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు సూచించారు.


గౌరవెల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

## గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి
## రైతులకు సాగునీరందించాలి : మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

**హుస్నాబాద్ రూరల్, జూన్ 17, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి తాటిపల్లి జీవన్‌రెడ్డి బుధవారం గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు గౌరవెల్లి ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి పురోగతి సాధించలేదని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పనులు 95 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు సాగు నీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని, కేవలం ఓట్ల రాజకీయాల కోసమే దీనిని ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ప్రాజెక్టు పూర్తికాకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులతో కోర్టులో కేసులువేయించారని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి విషయంలో ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన తిరుపతి రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ బొల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గవ్వ వంశీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గద్దల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి
### జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్


జోగిపేట సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

**జోగిపేట, జూన్ 17, ప్రభాతవార్త:** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, పోలీసు సిబ్బంది ప్రతిఒక్కరూ కూడా అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ సూచించారు. బుధవారంనాడు జోగిపేట సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటట్లాడుతూ పోలీసులు ప్రతిఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినపుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని సిబ్బంది విధుల్లోకి తీసుకోవద్దని అధికారులకు సూచించారు. రోడ్డుప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి ఆనుకొని ఉన్న గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నేరాలను ఛేదించటంలో సిసి కెమెరాల ప్రాధాన్యతను తెలియచేయాలని, ప్రతీ దాబా, పెట్రోల్ బంకుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా వారికి సిసి కెమెరాల ప్రాధాన్యతను వివరించాలన్నారు. అనంతరం సర్కిల్ పరిధిలో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదన కోసం సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంఆ ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంబడి డిఎస్పీ సత్తయ్యగౌడ్, సిఐ అనిల్‌కుమార్, వట్‌పల్లి ఎస్ఐ శ్రీహరి, జోగిపేట ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నూతన పంచాయతీ భవనానికి భూమిపూజ

**వెల్దుర్తి, జూన్ 17 ప్రభాతవార్త :** మాసాయిపేట మండలంలోని రామంతపూర్ తండాలో బుధవారం నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నూతన గ్రామపంచాయతీ కార్యాలయానికి భూమి పూజ చేశారు. అనంతరం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం యువసేనను నిర్వీర్యం చేస్తుందని ఆమె విమర్శించారు. ప్రభు త్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. బిఆర్ఎస్ హయంలో గ్రామ పంచాయతీల ద్వారా పల్లె ప్రగతి, వైకుంఠధామాలు నిర్మించడం జరిగిందని ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు నిధులులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కెసిఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని ఆమె అన్నారు. మొన్నటివరకు జరిగిన ధాన్యం కొనుగోలుకేంద్రాల్లో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆమె గుర్తుచేశారు. ఇప్పటివరకు సన్నవడ్లకు మద్దతు ధర ఇవ్వలేదని మహిళలకు 2500, 4000 పెన్షన్ ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. అందుకు రానున్న ఎన్నికల్లో ప్రజలే ప్రభుత్వానికి బుద్ధిచెబుతారని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఎమ్మెల్యేగా తన నిధులతో గ్రామాలను అభివృద్ధిచేస్తున్నానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ నాయక్, మోహన్‌రెడ్డి, నరసింహులు, తహసీల్దార్ జ్ఞాన జ్యోతి, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


నూతన గ్రామ పంచాయతీకి భూమి పూజచేస్తున్న సునీతాలక్ష్మారెడ్డి

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం
### -మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ తన్నీరుహరీష్‌రావు


మాట్లాడుతున్న హరీష్‌రావు

**హుస్నాబాద్ రూరల్, జూన్ 17, ప్రభాతవార్త**
పట్టణంలోని శ్రీసాయి ఫంక్షన్‌హాల్‌లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ హుస్నాబాద్‌కు బిఆర్ఎస్ పార్టీతో ప్రత్యేక అను బంధం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ తొలి రోజుల నుంచే ఈ ప్రాంత ప్రజలు పార్టీకి అండగా నిలిచారని, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల ప్రచారాన్ని హుస్నాబాద్ నుంచే ప్రారంభించేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. ప్రజలకు ఆశలు చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వాటిని విస్మరించి ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రైతుబంధు, రైతుబీమా, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కీలక పథకాల అమలులో ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ శ్రేణులు పూర్తి అవగా హన కలిగి ఉండాలని సూచించిన హరీష్ రావు, డబుల్ ఓట్లు, చనిపోయిన ఓటర్ల పేర్ల తొలగింపు వంటి అంశాల్లో ఎన్నికల అధికారులతో సమన్వ యం చేసుకుంటూ నిజమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయడంలో సహకరించాలని పిలుపునిచ్చారు. గౌర వెల్లి ప్రాజెక్టు, రైతు సంక్షేమం, దళితబంధు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల పనితీరు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా బలమైన నాయకత్వంకలిగిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రధాన ప్రతిపక్షంగా బిఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హరీష్‌రావు హెచ్చరించారు. కార్యక్రమం లో రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతా రావు, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు బ్యాంకులు కృషి చేయాలి
### సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు



మాట్లాడుతున్న అదరపు కలెక్టర్ పాండు

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 17, ప్రభాతవార్త:**
జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్య సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో మార్చి 2026 త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అదనపు కలెక్టర్ పాండు అధ్యక్షత వహించగా, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ టి.సుధీర్‌కుమార్ సమన్వయం చేశారు. సమావేశానికి ఆర్బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ వెన్న, నాబార్డ్ ఏజీఎం/డీడీఎం కృష్ణతేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని బ్యాంకుల కంట్రోలర్లు, ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో జిల్లా బ్యాంకింగ్ కార్యకలాపాలపై లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్‌కుమార్ సమగ్రనివేదికను సమర్పించారు. జిల్లాలో పంట రుణాల లక్ష్యం రూ. 3,499.21 కోట్లకుగాను 90.66 శాతం, మొత్తం వ్యవసాయ రుణాలలక్ష్యం రూ.6,816.57 కోట్లకుగాను 87.16 శాతం, మొత్తం అడ్వాన్సుల లక్ష్యం రూ.23,438.93 కోట్లకు గాను 92.81 శాతం సాధించినట్లు వివరించారు. అదేవిధంగా విద్యా రుణాలు, గృహ రుణాలు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల రుణాలు, స్వయం సహాయక సంఘాల రుణాలు, తదితర రంగాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, ప్రాధాన్యతా రంగాల అభివృద్ధికి బ్యాంకులు మరింత చురుకుగా వ్యవహరించి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించడంతోపాటు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. ఆర్బీఐ ఏజీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, బ్యాంకులకు కేటాయించిన గ్రామాల్లో ప్రధానమంత్రి జనసురక్ష పథకాలైన ప్రధాన్ మంత్రి జనధన్ యోజన, ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన అటల్ పెన్షన్ యోజన పథకాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మరింత మంది లబ్ధిదారులను చేర్చాలని సూచించారు. అలాగే రీకేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం, ఖాతాలను నిరంతరం సక్రమంగా నిర్వహించుకోవడంగురించి ఖాతాదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ మాట్లాడుతూ, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, పశు సంవర్ధక, మత్స్యరంగ రుణాల కింద అర్హులైన రైతులు, లబ్ధిదారులకు మరింతగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు.

సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, డీఆర్‌డీఏ, డీఐసీ తదితర విభాగాల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాలలు బలోపేతం కావాలి
### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్


అంగన్‌వాడీ విద్యార్థులతో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, జూన్ 17 ప్రభాతవార్త :** ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీలు మరింత బలోపేతం కావాలని, అంగన్‌వాడీలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు నమోదు శాతాన్ని పెంచాలని మెదక్ జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలలను డిఆర్డిఓ, డీఈవో, డిడబ్ల్యూఓ, గ్రామ సర్పంచ్‌తో కలిసి సందర్శించారు. జిల్లా కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రంలోనీ చిన్నారులతో ముచ్చటించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు ప్రాథమిక పాఠశాలలు మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అంగన్‌వాలలో, ప్రీస్కూల్స్‌లో, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్‌లతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీలలో, ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని, తల్లి దండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు , ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థుల వయస్సును బట్టి అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి,ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి , ఎంఈఓ తారా సింగ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
### సమీక్ష సమావేశంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, మండల స్థాయిలో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్య అధికారులతో ప్రజలకు అందిస్తున్న వివిధ ఆరోగ్య సేవలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్ఎంపి, పిఎంపిలు గ్రామ స్థాయిలో డెంగ్యూ కేసులకు చికిత్స అందించకుండా తగు చర్యలు చేపట్టాలని దోమలు అభివృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అవసరం ఉన్న చోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. అసంక్రమిత వ్యాధుల కార్యక్రమంలో(ఎన్‌సిడి) భాగంగా 30 సంవత్సరాల పై బడిన వారందరికీ పరీక్షలు నిర్వహించి మధుమేహం, రక్తపోటు, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలను గుర్తించి అవసరం ఉన్నవారికి చికిత్స అందించి పాలోప్ నిర్వహిస్తూ అవసరం ఉన్న వారిని పై స్థాయి ఆసుపత్రికి రెఫర్ చేయాలని ఆదేశించారు. క్షయ వ్యాధి కార్యక్రమంలో భాగంగా టిబి ముక్తి అభియాన్‌పైన జిల్లాలో చేపడుతున్న ఆరోగ్య సేవలను అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీ నమోదు దగ్గర నుంచి ప్రసవం అయ్యేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన ఎప్పటికప్పుడు వైద్యాధికారులు సమీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో ఓపి సంఖ్య పెంచాలని ఎబిహెచ్ఎ కార్డు ఎంట్రీలను పెంచాలన్నారు. జిల్లాను అన్ని ఆరోగ్య కార్యక్రమాల సేవలో మొదటి స్థానంలో నిలిపేందుకు సిబ్బంది కృషిచేయాలన్నారు. సమయపాలన పాటించాలని పాటించని వారిపైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ధనరాజ్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వినోద్, ఎసిడి డాక్టర్ నిర్మల, టిబి డాక్టర దీప్తి ప్రియాంక, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓలు డాక్టర్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, సహన్‌రాథోడ్, డెమో నవీన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

## కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొడదాం
### సిపిఐ నేత చాడ వెంకట్‌రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నరేంద్రమోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను పోరాటాల ద్వారా కార్మిక వర్గం తిప్పికొట్టాలని సీపీఐ మాజీ శాసనసభపక్ష నేత చాడ వెంకట్‌రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.బాలరాజులు పిలుపునిచ్చారు. జిల్లా ఏఐటీయూసీ 4వ మహాసభల సందర్భంగా బుధవారం పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ నుంచి కొత్త బస్టాండు శక్తిగార్డెన్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలలో వారు మాట్లాడారు. 1920 అక్టోబర్ 31న ఆవిర్భావించిన ఏఐటీయూసీ కార్మిక వర్గ లోకం కోసం నాటి నుంచి నేటీ వరకు అలుపెరగని పోరాటం చేస్తున్న ఏకైక సంస్థ ఏఐటీయూసీ అన్నారు. కార్మికులకు కనీస వేతనం, 8 గంటల పని, వి ధానాన్ని పోరాటం చేసి సాధించిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. కార్మికులకు శాపంగా మారిన రాంజీ పథకాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు తీసుకవచ్చి ప్రజలను రైతులను కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. మోడీ వికసిత్ భారత్ పేరిట ప్రగ్భలాలు పలుకుతున్నారని అన్నారు. దేశ సంపదను బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతూ పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపడమే వికసిత్ భారత్ లక్ష్యమని ప్రశ్నించారు. ఏఐటీయూసి దేశ స్వాతంత్ర్యం, తెలంగాణ సాయుధ పోరాటంలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించిందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం పూర్తిగా అమలు కావడం లేదన్నారు. కార్మికుల హక్కులను ప్రధాని మోడీ కాలరాశారని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరలు చీటికి మాటికి పెంచుతూ సామాన్య ప్రజానీకంపై మోయలేని భారం మోపుతుందన్నారు. వెంటనే పెంచిన పెట్రోల్,డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆది రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్,రాష్ట్రసమితి సభ్యులు కనుకుంట్ల శంకర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సభ్యులు బట్టు దయానందరెడ్డి, అందె అశోక్, ఎడల వనేష్, ఏఐటీయూసీ నాయకులు శివలింగు కృష్ణ, తవుసుపల్లి బిక్షపతి, కర్నాల చంద్రం, పిట్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రి సమస్యలు పరిష్కరిస్తా
### డిసిహెచ్ఎస్ డాక్టర్ కవిత

**జహీరాబాద్ జూన్ 17 ప్రభాతవార్త:** జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌తో చర్చించి పరిష్కరిస్తామని డిసిహెచ్ఎస్ డాక్టర్ కవిత అన్నారు. కొన్ని రోజులుగా స్థానిక ఆసుపత్రిలో మహిళలు, గర్భిణీలు వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న డిసిహెచ్ఎస్ డాక్టర్ కవిత బుధవారం ఆసుపత్రిని ఆకస్మిత తనిఖీ చేశారు. ఆస్పత్రిని సందర్శించిన అనంతరం డాక్టర్లు వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులుగా హాస్పిటల్‌లో గర్భిణీలకు వైద్య సేవలు శాస్త్ర చికిత్సలు నిలిచిపోవడంతో ఆమె డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆస్పత్రిని సందర్శించారని తెలుసుకొని కౌన్సిలర్లు నామా స్రవంతిరవికిరణ్, మజ్జిగ సుజితవిశ్వేశ్వర్లు డిసిహెచ్ఎస్ ను కలిసి గర్భిణీల సమస్యలపై త్వరగా స్పందించి సమస్యను పరిష్కరించి నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు డిసిహెచ్ఎస్ తో మాట్లాడుతూ ఆసుపత్రిలో లీడీ వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండేలా, రేడియాలజీ విభాగానికి చెందిన వైద్యుడు కూడా అనునిత్యం ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని రకాల మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉండటం లేవని వాటిని కూడా సమకూర్చాలని కోరారు... కార్యక్రమంలో సూపరింటెంట్ డాక్టర్ కిరణ్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

**కొల్చారం, జూన్ 17 (ప్రభాతవార్త):** లోక్ అదాలత్ విధులకు వెళ్తున్న పోలీసు కానిస్టేబుల్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలైన ఘటన బుధవారం కొల్చారం మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో మెడికల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కనుకుంట్ల లక్ష్మణ్ (56) బుధవారం మధ్యాహ్నం లోక్ అదాలత్ డ్యూటీ నిమిత్తం హోండా ఆక్టివా స్కూటీపై మెదక్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో అప్పాజిపల్లి గ్రామం వద్ద వనదేవి గుడి సమీపానికి చేరుకోగానే ఎదురుగా వచ్చిన టీవీఎస్ ఎక్సెల్ వాహనం రాంగ్ రూట్‌లో అతివేగంగా, నిరక్ష్యంగా వచ్చి స్కూటీని ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ ఎడమ కాలికి తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రాములు (43) నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుడు కొల్చారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## నల్లమట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు సీజ్

**నర్సాపూర్, జూన్ 17, ప్రభాతవార్త :** అనుమతి లేకుండా నల్లమట్టి అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం రాత్రి పట్టుకుని సీజ్ చేసికేసు నమోదు చేసినట్లు ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ మండల పరిధిలోని తుజాల్‌పూర్ గ్రామ చెరువు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమంగా నల్లమట్టిని తరలిస్తున్నారు. నల్లమట్టిని ఇటుకబట్టీలకు కొందరు అక్రమంగా తరలిస్తు విక్రయిస్తున్నారని తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశామని అక్రమంగా నల్ల మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కుతరలించామన్నారు. తహసీల్దార్ ద్వారా విచారణ జరిపించి అనుమతులు లేని పక్షంలో రవాణాకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి చెప్పారు.


నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో సిజ్ చేసిన మూడు ట్రాక్టర్లు

## దుబ్బాక అభివృద్ధికి రూ.2.01 కోట్ల నిధులు

**-రాయపోల్ మండలానికి రూ.32 లక్షల కేటాయింపు**

**రాయపోల్, జూన్ 17, ప్రభాతవార్త:**

దుబ్బాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు ప్రత్యేకచొరవతో రూ.2కోట్ల 1లక్షల నిధులు మంజూరయ్యాయని బిజెపి రాయపోల్ మండల అధ్యక్షుడు మంకిడి స్వామి తెలిపారు. నియోజకవర్గ ప్రజల మౌలిక వసతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిధులను కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో దుబ్బాక నియోజకవర్గవ్యాప్తంగా సిసిరోడ్లు, డ్రైనేజీల నిర్మాణపనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధిపనుల కోసం రూ.32లక్షలు ప్రత్యేకంగా కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు మరింత మెరుగుపడటంతోపాటు ప్రజలకు సౌకర్యాలు పెరుగుతాయని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధిపై ఎంపి రఘునందన్‌రావు ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ కేంద్ర, రాష్ట్ర స్థాయిలో నిధులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని మంకిడి స్వామి అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎంపి పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంతోపాటు రాయపోల్ మండల ప్రజల తరపున ఎంపి రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళలు స్వశక్తితో ఎదగాలి

**-సెర్ప్ డైరెక్టర్ నవీన్ సుధా**



ఈపాస్ మిషన్‌ను అందజేస్తున్న సెర్ప్ డైరెక్టర్ నవీన్ సుధా

**జగదేవ్‌పూర్, జూన్ 17, ప్రభాతవార్త:**

మహిళలు స్వశక్తితో రాణిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని సెర్ప్ డైరెక్టర్ నవీన్ సుధా అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో సంతోష మహిళారైతు ఉత్పత్తిదారులసంఘం మహాసభ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సెర్ప్ డైరెక్టర్ నవీన్ సుధా, సిద్దిపేట జిల్లా ఏపిడి సుధీర్, డిపిఎం వాసుదేవ్, శ్రీనిధి ఆర్ఎం మోహన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళారైతులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేశారని, మండలంలోని మొత్తం 192 రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో 35 ఎఫ్‌పిజి సంఘాలకు సీడ్ ఫండ్ కింద ఒక్కో సంఘానికి రూ.50వేల చొప్పున రూ.17.50 లక్షలు జమ చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో ఆర్థిక ప్రగతి సాధించేందుకు వ్యవసాయ పరికరాలు కొనుగోలుకు ఉపయోగించాలని సూచించారు.

**నగదు రహిత లావాదేవీలకు ప్రోత్సాహం...**

డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు స్త్రీనిధి ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్, ములుగు, మర్కుక్ మండలాలకు చెందిన ఆరు గ్రామసంఘాలకు ఈపాస్ మిషన్లను అందజేసినట్లు తెలిపారు. గ్రామీణప్రాంతాల్లో నగదు రహిత లావాదేవీలకు దోహదపడతాయని పేర్కొన్నారు.

**రూ.15 లక్షల ఫుడ్ స్టోరేజ్ గోదాం మంజూరు...**

రైతులు పండించిన పంటలను భద్రపరిచేందుకు జగదేవ్‌పూర్ మండలానికి ఫుడ్ స్టోరేజీ గోదాం నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎంలు నర్సయ్య, ఆనంద్‌కుమార్, యాదగిరి, గిరి, మండలవ్యవసాయాధికారి వసంతరావు, సిసిలు రవి, అనురాధ, పుష్పలత, చంద్రకళ, నాగరాజు, బాలకృష్ణ, లింగం బాబు, వివోఏలు వినోద, సరిత, వెంకటమ్మ, బిక్షపతిరెడ్డి, గందమల శివదాస్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, కనకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, రాకేష్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల మహిళా అధ్యక్ష, కార్యదర్శులు మంజె నర్సమ్మ, ఎల్లమ్మ, సుశీల, బాల్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షునిగా సాయిని మహేష్



మర్కుక్ మండల నూతన ఉపసర్పంచుల ఫోరం సభ్యులు

**మర్కుక్, జూన్ 17, ప్రభాతవార్త:**

మర్కుక్ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షునిగా మండలకేంద్రమైన మర్కుక్ ఉపసర్పంచ్ సాయిని మహేష్‌ను బుధవారం మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఉపసర్పంచుల ఫోరం ఉపాధ్యక్షునిగా కర్కపట్ల అన్వర్‌పాషా, దుబ్బాక మహేష్, ప్రధాన కార్యదర్శిగా జుట్టు సుధాకర్, సహాయ కార్యదర్శులుగా విజయ్‌సింగ్, ఎడమ సబితకరుణాకర్, సలహాదారులుగా దేవి విజయ రమేష్, భూకల ఐలయ్యలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సాయిని మహేష్ మాట్లాడుతూ తమపై నమ్మకంలో ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షునిగా ఎన్నుకున్న ఉపసర్పంచులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచులు ప్రకాష్, ప్రమీల సంతోష్, కొంతం సరితకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**గజ్వేల్ టౌన్, జూన్ 17, ప్రభాతవార్త:**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్‌కు చెందిన గుండ్ల రమేష్ ఇటీవల గుండెపోటుతో మరణించగా అతనితో పాటు పదవ తరగతి చదువుకున్న మిత్రులు బుధవారం అతని కుటుంబానికి మూడునెలలకు సరిపడా నిత్యావసరసరుకులు, రూ.34వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండ్ల రమేష్‌ది నిరుపేద కుటుంబం కాగా అతనికి భార్యతో పాటు 15 సంవత్సరాల పాప, 11 సంవత్సరాల బాబు ఉన్నారని తెలిపారు. వారి ధీన స్థితిని తెలుసుకొని ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని తెలిపారు.

## మహిళ అదృశ్యం

**జగదేవ్‌పూర్, జూన్ 17, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన పోకల రాణి(30) కుటుంబంలో నెలకొన్న కలహాల వల్ల ఈనెల 13వ తేదీన ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితులు, తెలిసిన ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో రాణి తల్లి అంకిరెడ్డి నర్సమ్మ జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కృష్ణారెడ్డి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్ఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పోకల రాణి అనే మహిళ ఇంటి నుండి వెళ్లే సమయంలో నీలంరంగు చీర, ఎరుపురంగు జాకెట్ ధరించి ఉందని, సుమారు 5 అడుగుల ఎత్తు, గుండ్రటిముఖం, ముఖంపై పుట్టుమచ్చ ఉంటుందని తెలిపారు. ఎవరికైనా మహిళ ఆచూకీ తెలిసినట్లయితే జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు 8712667339 నెంబర్‌లో సమాచారం అందించాలని ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**వర్గల్, జూన్ 17, ప్రభాతవార్త:**

ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొని మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన బల్లచోళ్ల కనకయ్య(48) అనేవ్యక్తి వారి బంధువులు శామీర్‌పేట కట్టమైసమ్మ వద్ద దావత్ చేయగా అక్కడికి ద్విచక్ర వాహనంపై వెళ్ళి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో రాత్రి 9.30 గంటల సమయంలో గౌరారం వద్దగల ఫార్మ్‌స్టే రిసార్ట్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని డివైడర్‌పై పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు.

# వ్యవసాయంలో ఏఐ సేవలు కీలకం

### శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పిలుపు

**పూడూరు, జూన్ 17. ప్రభాతవార్త :** రైతులు భూసార పరీక్షలు చేయించి ఎరువులను వాడితే భూమిపటిష్టంగా ఉంటుందని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం భారతీయ వరి పరిశోధనా సంస్థ, జిల్లా వ్యవసాయశాఖ సహకారంతో పూడూరు రైతు వేదికలో ఖేతీబచావో అభియాన్, వరిసాగులో కృత్రిమ మేదస్సు వినియోగం(రైస్-ఐఐఆర్ఆర్ మొబాయిల్ యాప్)పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలను పాటించి పంట మార్పిడి చేస్తే అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

**పూడూరులో పండ్ల మార్కెట్‌కు స్థలం అన్వేషణ**

పూలు, పండ్ల మార్కెట్ ఏర్పాటుకోసం పూడూరు సమీపంలో అసైన్‌మెంట్ భూమిని పరిశీలించాలని తహశీల్దారుకు సూచించారు. ఈ ప్రాంతంలో అక్రమంగా అసైన్‌మెంట్ ల్యాండ్‌ను కబ్జాచేసిన స్థానికేతరులకు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శైలజ మాట్లాడుతూ వ్యవసాయంలో కృత్రిమ మేదస్సు (ఎఐ) యొక్క ప్రాముఖ్యతను వివరించి, రైస్‌యాప్ ముఖ్యలక్షణాలను ప్రదర్శించారు. ప్రధాన శాస్త్రవేత్త (రోగశాస్త్రం)డాక్టర్ క్రిష్ణవేణి వరిపంటలో తలెత్తే వివిధ సమస్యలను, వాటి నివారణ చర్యల గురించి సమగ్రంగా వివరించి, యాప్‌ను ప్రదర్శించారు. ప్రధాన శాస్త్రవేత్త (సాయిల్ సైన్స్) డాక్టర్ బ్రజేంద్ర నేల వ్యవసాయానికి పునాది అని, పంటలకు పోషకాలు, నీరు, భౌతిక మద్దత్తు అందిసుందన్నారు. నేల ఆరోగ్య ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ పాపారావు శాస్త్రవేత్త మాట్లాడుతూ పోషక విలువలు కలిగిఉన్న బయోఫోర్టిఫైడ్ వరిరకాల గురించి తెలియజేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి



వరి వంగడాల కిట్లను రైతులకు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే

రాజరత్నం మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రభుత్వ పథకాలు, ఫర్టిలైజర్ యాప్‌గురించి వివరించారు. పూడూరు పిఎసిఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల రఘునాథరెడ్డి, మురళీధర్‌రెడ్డి అద్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆత్మచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, స్థానిక సర్పంచ్ ఖిజర్‌పాష, తహశీల్దారు విజయ్ కుమార్, ఎంపిడిఓ పాండు, ఎఓ లావణ్య, ఉప సర్పంచ్ రాందాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు పెంటయ్య, అజీపటేల్, ఎస్ శ్రీనివాస్, నాయకులు శ్యాంసుంర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనంతరాములు, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

### వైద్యశాఖ అధికారులకు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశం

**పూడూరు, జూన్ 17. ప్రభాతవార్త :** వర్షాకాలం సందర్భంగా ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ పేర్కొన్నారు. బుధవారం పూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, మందుల స్టోర్‌రూం, ఆయుష్ క్లినిక్, వార్డును, అక్కడే నిర్వహిస్తున్న కంటి స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించి, రోగులకు కళ్ల అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రతిరోజు డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైనందున రాష్ట్రీయ బాలస్వాస్థ కార్యక్రమం క్రింద అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన విద్యార్థులకు రక్తహీనత నివారణ మాత్రలు అందజేయాలన్నారు. చిన్నవ్యాధుల చికిత్సలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని వివరించారు. వర్షాకాలంలో పాముకాటు వంటి సంఘటనలు జరిగే అవకాశం ఉంటుందని, యాంటి స్నేక్ వీనంతోపాటు, కుక్కకాటు వ్యాక్సిన్ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు అందిస్తున్న సేవలగురించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సర కాలంగా మాతృ, శిశు మరణాలు ఏమైనా జరిగాయా? అని అడిగితెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24గంటలు పనిచేసే ఆసుపత్రిగా ప్రభుత్వం నుండి అనుమతులు పొందడానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అనంతరం కెజిబివి, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సంబందిత అధికారులకు



ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులను పరామర్శిస్తున్న కలెక్టర్ తదితరులు

సూచించారు. పారిశుధ్య పనులతోపాటు వంటశాలలు, స్నానాల గదులు, టాయిలెట్లు, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాబోధన ఉండాలన్నారు.

అనంతరం పిఎసిఎసి కార్యాలయాన్ని సందర్శించి యూరియా లభ్యతగురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం మండల తహశీల్దారు కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. భూసమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డిఎంహెచ్ఓ కే సుధాకర్‌లాల్, డిస్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి, తహశీల్దారు విజయ్‌కుమార్, ఎంపిడిఓ పాండు, ఎంఇఓ సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

# రూ.2.16 కోట్లతో శ్రీవారి ఆలయ పునర్నిర్మాణం

**దౌల్తాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల ప్రజల చిరకాల ఆకాంక్ష, ఎన్నో సంవత్సరాల కల ఎట్టకేలకు సాకారమైంది. మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద వెలిసిన శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన పునర్నిర్మాణ పనులకు బుధవారం ఉదయం 7:15 గంటలకు అత్యంత వైభవంగా భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆశీస్సులు, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, సీఎం సోదరులు ఎనుముల తిరుపతి రెడ్డి విశేష సహకారం, అలాగే స్థానిక మండల నాయకుల పట్టుదలతో ఈ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్ల 16 లక్షల భారీ నిధులను మంజూరు చేసింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భూమి పూజ మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప కట్టడం:తిరుపతి రెడ్డి**

ఈ చారిత్రాత్మక పుణ్యకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం సోదరులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతి రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దౌల్తాబాద్ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నేడు నెరవేరడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ ఆలయం కేవలం ఒక ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, రాబోయే తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి, వెయ్యి సంవత్సరాల చరిత్రకు సాక్ష్యంగా నిలిచే గొప్ప కట్టడంగా అవతరించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఆధ్యాత్మిక శోభతో విలసిల్లిన చెరువు కట్ట..**

ఈ మహోత్సవ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, అధికారులు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, దౌల్తాబాద్ మండల ప్రజలు పెద్ద సంఖ్యలో కుటుంబ



వేంకటేశ్వర స్వామి ఆలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ఎనుముల తిరుపతి రెడ్డి

సమేతంగా తరలివచ్చారు. భక్తులంతా స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల కోలాహలం, గోవింద నామస్మరణలతో దౌల్తాబాద్ చెరువు కట్ట పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభతో సంతరించుకున్నాయి.

**ఆకట్టుకుంటున్న ఆలయ నూతన నమూనా**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద సుమారు రూ.2.16 కోట్ల ప్రభుత్వ నిధులతో పునర్నిర్మించబోయే శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ నమూనా (మోడల్) చిత్రం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎంతో అధ్భుతమైన శిల్పకళా చాతుర్యంతో, భవిష్యత్ తరాలు గర్వపడేలా ఈ ఆలయ డిజైన్‌ను రూపొందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఈ నిధులు సాధ్యమయ్యాయని, ఈ అధ్భుత ఆధ్యాత్మిక కట్టడం ఈ ప్రాంతానికే మకుటాయమానంగా నిలవబోతుందని మండల నాయకులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రహదారిని పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

## రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి

**జవహర్‌నగర్, జూన్ 17. ప్రభాతవార్త :** బాలాజీ నగర్ నుండి చెన్నాపురం వరకు కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. రోడ్డు పనులు అత్యంత నెమ్మదిగా సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న రహదారి కారణంగా ప్రతిరోజూ వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రహదారిపై గుంతలు, దుమ్ము, ట్రాఫిక్ సమస్యల వల్ల ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. ఈ సందర్భంగా నాయకులు సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి రహదారి పనులను పూర్తి చేయాలని కోరారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి రహదారిపైనే బహిరంగ నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చంద్రపురి కాలనీ అధ్యక్షుడు కర్లపూడి జోగారావు, జవహర్ నగర్ అధ్యక్షుడు కమలాకర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, మైపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు కె. దయాకర్ తదితరులు పాల్గొన్నారు.




2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

## ఓటు ప్రజా స్వామ్యానికి పునాది

**తాండూరు, జూన్ 17, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యానికి బలమైన పునాది ఓటు హక్కు అని, మన ఓటు హక్కును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలో ఆర్డీఓ అనిత ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని ఇందిరాచౌరస్తా నుంచి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు 2కే రన్ ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అన్నారు. ఎస్ఐఆర్ అవగాహన కోసం వేస్తున్న ప్రతి అడుగు ప్రజా చైతన్యానికి నాంది అవుతుందని తెలిపారు. నకిలీ ఓట్లకు తావులేకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు, యువత దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, ఎస్ఐఆర్ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు, పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలు ధార్మిక విలువలకు ప్రతీకలు : మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్

**షాద్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ బుధవారం హైదరాబాద్ బేగంబజార్‌లోని ప్రసిద్ధ గణేష్ మందిర్‌తో పాటు భూలక్ష్మమ్మ ఆలయాలను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు తీసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గోశాలను సందర్శించి గోవులకు ఆహారం అందిస్తూ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో దేవాలయాలు ఆధ్యాత్మికతకు, ధార్మిక విలువలకు ప్రతీకలన్నారు. భూలక్ష్మమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించానన్నారు.




ఇన్‌ఫోడాట్ సిఇఓతో ఒప్పందం చేసుకుంటున్న రాఘవేందర్‌రెడ్డి

## నిరుద్యోగులకు ఏఐ, ఐటీలో ఉచిత శిక్షణ

**ఆమనగల్లు, జూన్17, ప్రభాతవార్త:** టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి నాయకత్వంలోని ఐక్యత ఫౌండేషన్ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రపంచాన్ని శాసించే స్థితిలో ఉన్న ప్రతిష్టాత్మకమైన ఆర్టిఫిషియేల్ (ఏఐ), ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)లో ప్రావీణ్యం సంపాదించేలా నిరుద్యోగ యువతకు త్వరలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెళ్ళడించారు. ఈమేరకు అమెరికాలోని ఇన్‌ఫోడాట్ గ్లోబల్ ఇంక్ సంస్థతో ఐక్యత భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు ఐక్యత ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని స్కిల్ హబ్‌గా మార్చేందుకు ఐక్యత ఫౌండేషన్ అహర్నిశలు శ్రమిస్తుందని, ఏఐ, ఐటీ, డాటా అనాలిస్టిక్స్, డిజిటల్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ రంగాలలో స్కిల్ సాధించేలా యువతకు శిక్షణ ఇచ్చి వచ్చే 5ఏళ్ళలో 5వేల ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ఏఐ, ఐటీ విభాగాలలో శిక్షణ ఇచ్చి నిరుద్యోగ యువతకు దేశ, విదేశాలలో ఉద్యోగాలు కల్పిస్తామని సుంకిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇన్‌ఫోడాట్ గ్లోబల్‌ఇంక్ ఫౌండర్ అండ్ సీఈఓ ఎం మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.



సంకటోనిపల్లిలో చదను పనులు పర్యవేక్షిస్తున్న చైర్మన్ పత్య, కమిషనర్

## ముమ్మరంగా మొహరం పండుగ ఏర్పాట్లు

**ఆమనగల్లు, జూన్17, ప్రభాతవార్త:** జూన్ 26న జరిగే మొహరం పండుగకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో ప్రజలు మొహరం పండుగను ప్రతిష్టాత్మకంగా జరుపుకుంటారు. ఈమేరకు పీర్ల సవ్వడితో పాటు గ్రామంలోని ప్రధాన కేంద్రం వద్ద నిర్వహించే వేడుకల స్థల ఏర్పాట్లు పరిశీలించారు. బుధవారం చైర్మన్ పత్యానాయక్, 8వవార్డు కౌన్సిలర్ ఎనుముల రమేశ్, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డిలు జరుగుతున్న పనులను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. మతాలకతీతంగా జరుపుకునే మొహరం పండుగ ఎంతో విశిష్టమైనదని వారు పేర్కొన్నారు. గ్రామపెద్దలు పండుగ కావలసిన ఏర్పాట్లు గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దావధనంజయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డి.మహేశ్, దావ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో అక్షరాలు రాయిస్తున్న సర్పంచ్ శ్రీనునాయక్

## అంగన్‌వాడీలో విద్యతోపాటు పౌష్టికాహారం

**ఆమనగల్లు, జూన్17, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రంలో విద్యతోపాటు పౌష్టికాహారం అందుతుందని రాంనుంతల సర్పంచు వద్యావత్ శ్రీనునాయక్ అన్నారు. 3ఏళ్ళ నుండి 6ఏళ్ళ వయస్సు కల్గిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించి వారి ఉన్నతికి దోహదపడాలని సూచించారు. మండల పరిధిలోని రాంనుంతల గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనిత, కేంద్రం టీచర్ అలివేలు ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ శ్రీనునాయక్, పంచాయతీ పాలకవర్గం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈమేరకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచు శ్రీనునాయక్ చేత చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈమేరకు శ్రీనునాయక్ మాట్లాడుతూ అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రాలలో చిన్నారులకు అనువైన, ఆకట్టుకునే వాతావరణం ఉండేలా అభివృద్ధి పరచాలని కోరారు. ప్లేవే మెథడ్ విద్యనందిస్తే అంగన్‌వాడీ కేంద్రాలకు మరింత స్పందన లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచు రాజేశ్వరిమోహన్, వార్డు సభ్యులు సరిత, ధన్‌రాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సంతోష, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఆశవర్కర్లు, ఆయాలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మ మాట- అంగన్‌వాడి బాట కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

## పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి

**పెద్దేముల్, జూన్ 17, ప్రభాతవార్త:** గర్భిణిల, బాలింతల, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో అంగన్‌వాడి కేంద్రాలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నాయని సర్పంచ్ హేమలత లాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం గాజీపూర్ అంగన్‌వాడి కేంద్రం-1లో అమ్మ మాట-అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హేమలత మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్‌వాడి టీచర్ జహంగీర్ బేగం మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్‌వాడి కేంద్రాల్లో కల్పిస్తున్న పూర్వ ప్రాథమిక విద్య ఎంతో దోహదపడుతుందని అన్నారు. తల్లులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడి కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కేంద్రం-2 టీచర్ బీబి, ఆయాలు పాల్గొన్నారు.



బ్రహోత్సవాల్లో పాల్గొన్న బిజెపి నేతలు సుదర్శన్‌రెడ్డి తదితరులు

## చౌదరిగూడలో ఘనంగా బ్రహోత్సవం

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 17, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ చౌదరిగూడలోని శ్రీ వేంకటేశ్వర స్వామి అష్టమ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఇంఛార్జ్ మాజీ ఎంపీపీ వై. సుదర్శన్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోఛ్చారణల మధ్య తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.అమరేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, నాయకులు వీరారెడ్డి, మహేందర్‌రెడ్డి, బ్రాహ్మరావు, రాజిరెడ్డి, నారాయణ నాయక్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహేంద్రచారి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 17, ప్రభాతవార్త:** అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తరుణి మహేంద్రచారిని నియమించినట్లు ఆ సంఘ సభ్యులు బుధవారం నాడొక ప్రకటనలో తెలిపారు. పోచారం డివిజన్ కొర్రెములకు చెందిన తరుణి మహేంద్రచారి అఖిల భారత విశ్వకర్మ సంఘం అభివృద్ధి కొరకు చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినట్లు తెలిపారు. సమాజ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోశ్‌చారి పేర్కొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

## నర్సరీ, మామిడి తోటను పరిశీలించిన ఎంపీడీవో

**హుస్నాబాద్ టౌన్, జూన్ 17, ప్రభాతవార్త :** మండలంలోని తోటపల్లి నర్సరీతో పాటు పూసవేర్లపల్లిలో ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మామిడి తోటను బుధవారం మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) సురేష్ పరిశీలించారు. నర్సరీలో మొక్కల సంరక్షణ, నీటి సరఫరా, పరిశుభ్రత నిర్వహణ అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలుచేశారు. మొక్కలను పెంచి గ్రామాల్లో చేపట్టే హరిత కార్యక్రమాలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం పూసవేర్లపల్లిలో ఈజీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన మామిడి తోటలో మొక్కల పెరుగుదల, సంరక్షణ చర్యలను పరిశీలించారు. తోట అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి మొక్కల మనుగడను పెంచేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, ఏపీఓ పద్మ, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని రాజ్‌కుమార్‌గౌడ్, నియోజకవర్గ స్పోర్ట్స్ ఇంచార్జ్ వెన్న రాజు, ఏఎంసీ డైరెక్టర్ పోతుగంటి బాలయ్య, గాంధీనగర్ మాజీ సర్పంచ్ బొంగోని శ్రీనివాస్, ఈజీఎస్ ఈసీ పరుశరాములు, కార్యదర్శి మహేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ అన్నపూర్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బోర్పట్లలో అభివృద్ధి పనులు ప్రారంభం




బస్సును ప్రారంబిస్తున్న ఆవుల రాజిరెడ్డి, సర్పంచ్, ఇతరులు

**హత్నూర జూన్ 17, ప్రభాతవార్త :** హత్నూర మండలం బోరుపట్ల గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులను సర్పంచ్ గంగారెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అవుల రాజిరెడ్డి ప్రారంభించారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన సిసి రోడ్లను, ప్రభుత్వ పాఠశాలలో స్థానిక పరిశ్రమ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్‌ను, బోరుపట్ల, పల్పనూర్ గ్రామాల విద్యార్థులకు రవాణా సౌకర్యం కొరకు ఏర్పాటు చేసిన మినీ బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగారెడ్డి, ఉప సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ పొట్లచెరువు కిష్టయ్య, సొసైటీ చైర్మన్ దుర్గారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రె కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు రంజిత్ రెడ్డి, కొన్యాల వెంకటేశం, తలారి రాజేందర్, సుజాత సత్యం, నరసింహారెడ్డి, శోభన్ బాబు, స్థానిక వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నల్లకుంటకు నూతన శోభ.. సుందరీకరణ పనులకు శ్రీకారం



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కకుఉమార్‌గౌడ్ తదితరులు

**గుమ్మడిదల, జూన్ 17 (ప్రభాతవార్త):** గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని దోమడుగు గ్రామంలో ఉన్న నల్లకుంట చెరువు సుందరీకరణ పనులకు బుధవారం మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. హెటెరో పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్లు, గ్రామ నాయకులు, పరిశ్రమ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పాలకవర్గం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నల్లకుంట చెరువును సుందరీకరించి గ్రామానికి మరింత అందాన్ని తీసుకురావడంతోపాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. చెరువు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజల వినియోగానికి అనుకూలంగా మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి గ్రామం సమగ్ర అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నామని, ప్రజల సంక్షేమం కోసం అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఆయన అన్నారు. హెటెరో పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల ద్వారా గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు అభిషెట్టి రాజశేఖర్, నర్సంపల్లి రాజిరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు బీవీ రెడ్డి, ఉమా మహేశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## చిరాగ్‌పల్లి నూతన ఎస్ఐగా వినయ్‌కుమార్

**మొగుడంపల్లి, జూన్ 17(ప్రభాతవార్త):** చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్సై)గా వినయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వినయ్ కుమార్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇంతకుముందు చిరాగ్‌పల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన రాజేందర్ రెడ్డి బదిలీపై జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

## రైతులకు మినీ కిట్స్ పంపిణీ

**సిర్గాపూర్, జూన్ 17 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం రైతులకు మినీకిట్స్‌ను మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, సర్పంచ్ శ్రీనివాసరావు పాటిల్‌లు పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ఉపయోగించే డబ్ల్యూఆర్‌జి 255 కంది, విబిఎన్– 8 రకం మినుములు, ఎన్‌జిజి 385 రకం మినుము కిట్స్ 4కిలోల ప్యాకెట్‌లను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొనగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ, సర్పంచ్‌లు సూచించారు.

## బడుగు బలహీనుల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

-సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణగౌడ్

**కౌడిపల్లి, జూన్ 17 ప్రభాతవార్త:** బడుగు బలహీనుల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యంగా పనిచేస్తుందని సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు చందం కృష్ణగౌడ్ పేర్కొన్నారు. బుధవారం కౌడిపల్లి మండలం శేరితండ గ్రామ పంచాయతీలో కోర్రతండాలో నునావత్ సుశీలమాన్సింగ్ ఇందిరమ్మ ఇంటిని తహసీల్దార్ కృష్ణయ్య, చంద్రం కృష్ణగౌడ్, సర్పంచ్ గణేష్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన కుటుంబాలకు అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరమని వారు అన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే సిఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశమని వారు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం గృహ యజమాని అతిధులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుర్మ లక్ష్మణ్, దేవేందర్, మురళి నాయక్ గ్రామప్రజలు, వార్డుసభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్న మోడీ

**సిపిఐ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**




మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, జూన్ 17, ప్రభాతవార్త**

దేశాన్ని పాలిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం భారీగా అప్పులు చేసి ప్రజలపై పన్నుల రూపంలో భారం మోపుతోందని, దేశ వ్యాప్తంగా ఆగస్టు 6 నుంచి సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహించి, సెప్టెంబర్ 1న ఢిల్లీలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో జాప్యం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్రతిష్ట ఎదురవుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పద్మ, మండల సహాయ కార్యదర్శి కుమారస్వామి, నాయకులు విజయ, కొమురయ్య, మల్లారెడ్డి, మొగిలయ్య, బాలయ్య, రఘుపతి, నిర్మల, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మండపానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## ఆధ్యాత్మికతకు కేంద్రాలు దేవాలయాలు

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**జిన్నారం, జూన్ 17, ప్రభాతవార్త:** భారతీయ సంస్కృతిలో దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయని ప్రజల్లో భక్తి భావం పెంపొందించడంలో నూతన దేవాలయాల నిర్మాణాలు అత్యంత ఆవశ్యమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహి పాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జిన్నారం మున్సిపాలిటీ కేంద్రంలోని తాంబేలు గుట్టపై కొలువుతీరిన మరకత శివలింగ స్వామి దేవాలయం ఆవరణలో గూడెం విష్ణువర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం సొంత నిధులతో భవన నిర్మాణ మండపానికి జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్దన్ ఆలయ పాలకవర్గం స్థానిక నేతల తో కలిసి శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధి కోసం మొత్తం రూపాయలు 36 లక్షల సొంత నిధులను కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ నూతన దేవాలయాల నిర్మాణాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు దేవాలయాలు మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు మార్గదర్శకాలు కావడంతో పాటు సమాజానికి శాంతి ఐక్యతలను అందించే ముఖ్య కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు పటాన్ చేరు నియోజకవర్గంలో నూతన దేవాలయ నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి , శివాలయ చైర్మన్ బుక్క శ్రీకాంత్ , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్ ,మున్సిపల్ కౌన్సిలర్లు నాయకులు ఆలయ పాలకవర్గ సభ్యులు మున్సిపాలిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మినీకిట్స్ పంపిణీ

**సిర్గాపూర్, జూన్ 17 ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రైతు వేదికలో బుధవారం రైతులకు మినీకిట్స్‌ను మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, సర్పంచ్ శ్రీనివాసరావు పాటిల్‌లు పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ఉపయోగించే డబ్ల్యూఆర్‌జి 255 కంది, విబిఎన్– 8 రకం మినుములు, ఎన్‌జిజి 385 రకం మినుము కిట్స్ 4కిలోల ప్యాకెట్‌లను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొనగా అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ, సర్పంచ్‌లు సూచించారు.

## మంత్రి ప్రోద్బలంతోనే బిఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు నమోదు: క్రాంతి కిరణ్

**జహీరాబాద్, జూన్ 17 (ప్రభాతవార్త):** రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రోద్బలంతోనే బిఆర్ఎస్‌కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆరోపించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అశోక్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం జహీరాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. సింగూర్ ప్రాంతంలో మంత్రి బంధువులు చెరువుల ఆక్రమణలకు పాల్పడుతున్న విషయాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తున్న అశోక్ కుమార్‌ను మాఫ్టీలో వచ్చిన పోలీసులు అరెస్టు చేసి జహీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నిస్తున్న గొంతులను అణచివేయడానికి అధికార యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని విమర్శించారు. సింగూర్ డ్యాం పరిసర ప్రాంతాల్లో మంత్రి బంధువులు పెద్ద ఎత్తున చేపల చెరువుల ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించిన క్రాంతి కిరణ్, ఈ అంశాలను వెలుగులోకి తెస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను బెదిరించేందుకు కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహ పదవీ బాధ్యతలు చేపట్టి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నప్పటికీ అందోల్ నియోజకవర్గంలో గణనీయమైన అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నిర్మించిన రోడ్లే ప్రస్తుతం ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క కొత్త రోడ్డు కూడా నిర్మించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై రాజకీయ కక్షసాధింపుతో కేసులు నమోదు చేస్తే సహించబోమని హెచ్చరించిన ఆయన, అరెస్టు చేసిన సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అశోక్ కుమార్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీభవన్‌కు తరలి వెళ్లిన నూతన మండల అధ్యక్షులు,కాంగ్రెస్ శ్రేణులు

**జహీరాబాద్ జూన్ 17 ప్రభాతవార్త :** జహీరాబాద్ నియోజకవర్గ నూతనంగా ఎన్నికైన మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో బుధవారం బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున గాంధీభవన్ కు తరలి వెళ్లారు. నూతనంగా మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నూతనంగా నియమించిన సందర్భంగాముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు లీలిది మహేష్ కుమార్‌గౌడ్ ఎంపీ.సురేష్ కుమార్ షెట్కార్ మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ చంద్రశేఖర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన మండలాల పట్టణ పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు ఎంజి రాములు యాదవ్ నరేష్ గౌడ్ కె భాస్కర్ రెడ్డి, ఉదయ్ శంకర్ పార్టీ, స్వర్ణ మల్లన్న పాటిల్ , పవన్ కుమార్ రాథోడ్ , ముజఫర్ హుస్సేన్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**సదాశివపేట, జూన్ 17 ప్రభాతవార్త :** మండల సమాఖ్య సమావేశంలో ఘన ద్రవవ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటి స్థాయిలోనే చెత్తను నాలుగు బుట్టల్లో(4 బిన్స్) వేర్వేరుగా సేకరించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ రహిత గ్రామాల సాధనకు చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సభ్యులకు వివరించారు. అలాగే గ్రామసంఘాల నాయకులకు స్టీల్ బ్యాంక్ ప్రతిపాదనల గురించి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీలకు ఇంటి స్థాయిలో చెత్త వేరు చేయించడం ప్రధాన సవాలుగా మారిందని, ఈ ప్రక్రియలో స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేయ డం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అన్ని పంచా యతీ కార్యదర్శులు, గ్రామస్థాయి సిబ్బంది స్వయం సహాయక సంఘాల సమావేశాలకు హాజరై సభ్యుల్లో అవగాహన పెంచాలని, ఇంటింటా చెత్త వేరుచేసే విధానాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలని సమావేశంలో పిలుపునిచ్చారు. గ్రామాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, వ్యర్థాల సేకరణలో భాగస్వాములు కావాలని కోరారు.

## ఘన వ్యర్థపదార్థాల ప్రక్షాళనకు శ్రీకారం

-మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ -బయో మైనింగ్ యంత్రాల ఏర్పాటు

**నర్సాపూర్, జూన్ 17, ప్రభాతవార్త:**

నర్సాపూర్ డంపింగ్ యార్డ్‌లో సంవత్సరాల తర బడి నిల్వ ఉన్న ఘన వ్యర్థపదార్థాల ప్రక్షాళనకు బయోమైనింగ్ చేయడం జరుగుతుందని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డ్‌లో ఉన్న ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణలో భాగంగా గత 6 సం వత్సరాలనుండి పేరుకు పోయిన చెత్తను శాస్త్రీయ పద్ధతిలో బయోమైనింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బయోమైనింగ్ కోసం కావలసిన యంత్రాలు సంబంధిత ఏజెన్సీ వారు తీసుకువచ్చారు. ఈ బయోమైనింగ్ కోసం అమర్చే యంత్రాలను మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోమైనింగ్ పద్ధతిలో ఇన్ని సంవత్సరాల నుండి డంపింగ్ యార్డ్‌లో వేసిన చెత్తను పూర్తిగా బయోసాయిల్ ద్వారా ఇతర వ్యర్థాలను వేరు చేసి ఆ వ్యర్థాలను తొలగించడం జరుగుతుందన్నారు. తొలగించిన వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు పంపి స్తామన్నారు. ఈ పద్ధతి ద్వారా నర్సాపూర్ డం పింగ్ యార్డ్‌లో సంవత్సరాల తరబడి పేరుకుపో యిన వ్యర్థాలు పూర్తిగా శుభ్రం చేయబడతాయని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. నర్సాపూర్ డంపింగ్ యార్డ్‌లో బయోమైనింగ్ చేసే సిబ్బందికి అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తామని మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, సానిటరీ ఇన్స్పెక్టర్ మురళి, వార్డు అధికారి ఉదయ్‌కుమార్, మున్సిపల్ సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు.



బయో మైనింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

# మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/చిన్నకోడూరు, జూన్ 17, ప్రభాతవార్త :**

చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని ఇమాంబాద్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి బుధవారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న వసతులను పరిశీలించారు. రామంచ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య బోధనతోపాటు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం మెనూ ప్రకారం విద్యార్థులకు అందించి శారీరకంగా ఎదిగేలా ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించగా మెనూ ప్రకారం కూరలు, ఆహారం లేకపోవడంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తంచేసి ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహించినందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ఇమాంబాద్‌లో...**

సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని ఇమాంబాద్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలలో విద్యార్థుల హాజరు శాతం పూర్తిగా ఉండేలా ఉపాధ్యాయులు చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. మెనూ ప్రకారం ఏ రోజు ఏది వండి పెట్టాలో విద్యార్థులకు పూర్తిగా అమలుచేయాలన్నారు. పాఠశాల పునఃప్రారంభమైనందున పాఠశాలల పరిసరాలతో పాటు తరగతి గదులు, వంట గదులను, మరుగుదొడ్లను శుభ్రం చేయాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు తదితర సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే సరి చేసుకోవాలన్నారు.




మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు

## కార్మిక సంక్షేమమే సిఐటియు ధ్యేయం

**సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు**

**జహీరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త :** కోహీర్ మండలం దిగ్వాల్ లోని పిరామల్ ఫార్మా పరిశ్రమలో సిఐటియు ఆధ్వర్యంలో వేతన ఒప్పందం కుదిరిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు తెలిపారు. బుధవారం వేతన ఒప్పందం కుదిరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం పట్ల సిఐటియు కు ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా ఈ వేతన ఒప్పంద మన్నారు. ఈ వేతన ఒప్పందం అయిన సందర్భంగా కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించి అగ్రిమెంటులో సాధించిన విజయాలను కార్మికులకు వివరించారు.ఈ సందర్భంగా చుక్కారాములు మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమలో ఈ రకమైన వేతన ఒప్పందం జరగడం గొప్ప విషయమని, ఈ ఈ వేతనం ఒప్పందం జరగడానికి కార్మికుల ఐక్యతే కారణమన్నారు. వేతన ఒప్పందం వివరాల ప్రకారం సరాసరిగా పరిశ్రమంలో పర్మనెంట్ కార్మికులకు 14,700 పెరగడంతో పాటు జుదీతీ రూ 6 నుండి రూ 7.50 పెంపు, బోనస్ రూ 16000 రూ 18000/ పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ 25000నుండి రూ 50,000 పెంపు, బిశితి రూ 4,5000/ నుండి రూ 10,00,000/ పెంపు జరిగిందన్నారు. వేతన ఒప్పందానికి సహకరించిన కార్మికులకు అభినందనలు తెలిపారు. నిరంతరం సిఐటియు కార్మికుల కోసం కార్మికుల సంక్షేమం కోసం పోరాడుతుందని యాజమాన్యాలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు పోరాటాలు నిర్వహిస్తూ వారి సంక్షేమానికి కట్టుబడ్డ ఏకైక సంఘ్మ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, జహిరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి నరసయ్య మహీంద్రా అండ్ మహీంద్రా మహీంద్రా ట్రాక్టర్స్ రాకూల్ యూనియన్ల నాయకులు నరేష్ మహేశ్వర్ సంగమేశ్వర్ ఆయా యూనియన్ల నాయకులు ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

## యువత మత్తుపదర్థాలకు దూరంగా ఉండాలి

**సర్పంచ్ శిల్పనర్సింలు**

**కొండపాక, జూన్ 17, ప్రభాతవార్త :** విద్యార్థులు, యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని సర్పంచ్ శిల్పనర్సింలు అన్నారు. బుధవారం లకుడారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సాంస్కృతిక కళాబృందం ఆధ్వర్యంలో కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియామాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందన్నారు. కళాకారుల టీం లీడర్ శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో కళాప్రదర్శన నిర్వహించి వివిధ రకాల అంశాలపై పాటలు పాడుతూ గ్రామస్తులకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యెల్లు శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, కారోబార్ గణేష్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ

**బెజ్జంకి, జూన్ 17, ప్రభాతవార్త :** విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సర్పంచ్ ముక్కిస కవితరత్నాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్,క్రీడాదుస్తులు పంపిణీచేసి మాట్లాడారు. విద్య నేర్చుతోనే అన్ని సాధ్యమని విద్య లేకపోతే భవిష్యత్ శూన్యమన్నారు. పాఠశాలలో కంప్యూటర్లతోపాటు ప్రొజెక్టర్ విద్యార్థులకు ఉపయోగపడేలా అందుబాటులో ఉన్నాయన్నారు. పాఠశాలలో ఇంగ్లీషు బోధనతో పాటు మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలోని విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చేరాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగాధర హరీష్, వార్డు సభ్యులు ముక్కిస రమణా రెడ్డి, బోనగిరి మహేష్, కూతురు అనసూయ, సంధ్య,బోనగిరి తిరుమల, వనపర్తి పద్మ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై నిఘా పెట్టాలి

**ఎంఆర్‌పిఎస్ నేత పుర్ర మహేష్**

**కొల్చారం, జూన్ 17 (ప్రభాతవార్త):** విద్యా సంస్థలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల కార్యకలాపాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని ఎంఆర్‌పిఎస్ నాయకుడు పుర్ర మహేష్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, నిబంధనలను అతిక్రమిస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక ప్రైవేట్ పాఠశాలలు ట్యూషన్ ఫీజులతోపాటు యూనిఫాంలు, పుస్తకాలు తదితరాల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చేశాయని ఆరోపించారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు బంగారం తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఫీజులు చెల్లించే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ప్రైవేట్ పాఠశాలలు ఫీజులను పెంచుతున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసి, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులపై నియంత్రణ తీసుకురావాలని కోరారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

**బెజ్జంకి, జూన్ 17, ప్రభాతవార్త :** మండలంలోని బేగంపేట గ్రామంలో అనారోగ్యంతో అకాల మరణం చెందిన గోవికారి రవి, కడమంచి అబ్బయ్య గారి కుటుంబీకులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ బుధవారం పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పార్టీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు లింగాల శ్రీనివాస్,ఎలా విజయ శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, సోమురాంరెడ్డి, నూనె రాజేందర్,గంటికోట సురేష్, జెల్ల ప్రభాకర్, రావుల నర్సయ్య, కర్రావుల సందీప్, పిట్టల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తా : ఎమ్మెల్యే

**జిన్నారం, జూన్ 17, ప్రభాతవార్త :** గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజిపల్లి జీఎంఆర్ కాలనీలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని, త్వరలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖాజిపల్లి పరిధిలోని జీఎంఆర్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీలలో ఎమ్మెల్యే జీఎంఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సర్వేనెంబర్ 181లో ప్రజల సౌకర్యార్థం గుడి, మసీదు, చర్చి, శ్మశానవాటిక, అంగన్‌వాడీ, చట్ పూజ ఘాట్, క్రీడా మైదానం, ప్రాథమిక పాఠశాల నిర్మాణాలకు త్వరలో స్థలాలు కేటాయించి భవన నిర్మాణాల పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ కాలనీలో సీసీ రోడ్డు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జీఎంఆర్ కాలనీలో గ్రామ దేవత గుడి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుష్మ శ్రీకాంత్, తహసిల్దార్ ఆంథోనీ, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

# భూభారతితో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

## -ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, జూన్ 17, ప్రభాతవార్త:** భూభారతితో రైతుల భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని జుక్కల్‌గ్రామంలో నిర్వహించిన భూభారతి భూముల రీసర్వే గ్రామసభ అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన ధరణిపోర్టల్ లోపాల కారణంగా అనేకమంది పేద రైతులు తమ భూముల హక్కులను కోల్పోయారని, భూకబ్జాలకు అవ్యవస్థ కారణమైందని ఆరోపించారు. గతప్రభుత్వ హయాంలో ధరణి లోపాలను ఆసరాగాచేసుకుని కొందరు నాయకులు పేద రైతుల భూములను కబ్జాచేశారని విమర్శించారు. ఎంతోమంది నిజమైన భూయజమానులు తమ సొంత భూములపై హక్కులు కోల్పోయి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో భూభారతి భూముల రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఈసర్వేతో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అర్హులైన ప్రతిరైతుకు న్యాయం జరిగేలా పారదర్శకంగా ఈప్రక్రియ కొనసాగుతుందని భరోసా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టే ఈ రీసర్వే ద్వారా ప్రతి భూమికి స్పష్టమైన డిజిటల్ రికార్డులు అందుబాటులోకి వస్తాయన్నారు. జుక్కల్ గ్రామ రైతులు సర్వే అధికారులకు పూర్తిసహకారం అందించి, తమ భూములకు సంబంధించిన సరైన పత్రాలను సమర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ నారాయణ, సర్పంచ్ ఏసమ్మ, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నారాగౌడ్, నాయకులు సురేందర్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, సురేష్ గౌడ్, రైతులు, గ్రామప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయం..**

**-ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

**పెద్దశంకరంపేట, జూన్ 17, ప్రభాతవార్త** మండల పరిధిలోని జుక్కల్ గ్రామంలో ఒకేరోజు 14మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదప్రజల సొంతింటి కలను నిజంచేయాలనే సంకల్పంతో పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాల అమలుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ నారాయణ, గ్రామ సర్పంచ్ ఏసమ్మ, ఏఈ కౌశిక్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నారాగౌడ్, నాయకులు సురేందర్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకేతకి ఆలయాన్ని దర్శించుకున్న న్యాయమూర్తి



న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

**ఝరాసంగం, జూన్ 17, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తి శ్రీదేవికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. ఆలయంలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా న్యాయమూర్తి శ్రీదేవి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు న్యాయమూర్తి శ్రీదేవికి ఆశీర్వచనాలు చేసి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జగదీశ్వర్, రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, ఆలయ ఈఓ శివ రుద్రప్ప, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డికి ఘన సన్మానం

**న్యాల్‌కల్, జూన్ 17, ప్రభాతవార్త:** మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులుగా నియామకం అయిన కొత్తపల్లి భాస్కర్ రెడ్డిని బుధవారం న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి ఆధ్వర్యంలో మండలకేంద్రమైన న్యాల్‌కల్‌లో ఘనంగా సన్మానించారు. మండలంలో పార్టీని మరింత పటిష్టపరిచేందుకు మండలాధ్యక్షులు భాస్కర్‌రెడ్డికి అండగా ఉంటామని సిద్దలింగయ్యస్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అడివప్ప, బొల్లి శ్రీనివాస్, యునుస్‌ఖాన్, బొల్లి ఈరన్న, జక్కుల సురేష్, ఆంజనేయులు, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో లారీల కొరత రైతుల రాస్తారోకో



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

**పెద్దశంకరంపేట, జూన్ 17, ప్రభాతవార్త:** పెద్దశంకరపేట పట్టణ సమీపంలోని సబ్ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలో లారీలు అందుబాటులో లేకపోవడంతో రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. మూడురోజులుగా జొన్నల తరలింపు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారి 161పై నిరసన చేపట్టారు. రోడ్డుపై తట్టు సంచులు కాల్చి కొంతసేపు రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, ఎఎస్సై సంగమేశ్వర్, పోలీస్ సిబ్బంది, నేషనల్ హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సంబంధిత పిఎసిఎస్ అధికారులతో చర్చించి లారీల కొరతను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో రైతులు తమ ఆందోళనను విరమించి రహదారిని ఖాళీచేశారు.

## డిగ్రీ విద్యార్థులకు ఏఐ, డిజిటల్ శిక్షణ

**జోగిపేట, జూన్ 17, ప్రభాతవార్త:** ప్రస్తుత విద్యాసంవత్సరానికిగాను కళాశాల విద్యాశాఖ ప్రతిష్మాత్మకంగా చేపట్టిన అమ్మ-అక్క మెంటర్‌షిప్ కార్యక్రమాన్ని బుధవరాం జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రెండురోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందులో శిక్షణపొందిన విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వపాఠశాలలకు వెళ్లి 6నుంచి 10తరగతుల విద్యార్థులు కృత్రిమమేధ, డిజిటల్ అక్షరాస్యత, డిజిటల్‌టూల్స్, అధునాతన సాంకేతికత, సాంకేతికసురక్షిత, బాధ్యాతాయుతవినియోగం వంటి అంశాలపై జులై 1నుంచి 30 గంటలపాటు బోధించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. దీనికిగాను ప్రతి విద్యార్థికి ఒక అకాడమిక్ క్రెడిట్‌ను కూడా ఇస్తారని ఆయన పేర్కొన్నారు. ఈశిక్షణకార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్‌గా గోకరాజు గంగరాజు ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు సుమత హాజరయ్యారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు

**న్యాల్‌కల్, జూన్ 17, ప్రభాతవార్త:** అర్హులందరికి సంక్షేమపథకాలు అందచేస్తున్నఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని మండల కాంగ్రెస్‌పార్టీ మాజీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండలపరిధిలోని బసంత్‌పూర్‌గ్రామంలో గ్రామానికి చెందిన మంగలి అంజమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, మండల ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం అధ్యక్షులు అబ్బాస్ అలీ, వార్డుసభ్యులు లాలప్ప, జాన్ తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లు, దాబాలలో పరిశుభ్రత పాటించాలి..!

**-మున్సిపల్ కమిషనర్ తిరుపతి**



దాబా హోటల్‌లో కిచెన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

**జోగిపేట, జూన్ 17, ప్రభాతవార్త:** అందోలు-జోగిపేట మున్సిపాలిటీపరిధిలో ఉన్న దాబా హోటళ్లు, రెస్టారెంట్లు, హోటళ్ల పరిశుభ్రతను పాటించాలని, వినియోగదారులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్‌కమిషనర్ తిరుపతి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఓ దాబాపై ఫిర్యాదు వచ్చిన సందర్భంగా ఆ దాబాను తనిఖీ చేయాల్సిందిగా మున్సిపల్ సిబ్బందికి సూచించారు. కలుషితమైన ఆహారం, కుళ్లిపోయిన ఆహారం నిల్వ ఉంచటం, పరిశుభ్రత పాటించని పక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆయన పేర్కొన్నారు.

**దాబా నిర్వహకుడికి రూ.2500 జరిమానా..**

మున్సిపాలిటటీ పరిధిలోని అందోలు శివారులోని దాబా హోటల్‌ను మున్సిపల్ అధికారులు బుధవవారం పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, వినియోగదారులకు వడ్డించే విధానం, పరిశుభ్రత తదితర అంశాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. కాగా, నిర్వహణ అంత పకడ్బందీగా లేకపోవటంతో మున్సిపల్ నిబంధనల ప్రకారం రూ.2500ల జరిమానా విధించగా, వెంటనే ఆ మొత్తాన్ని దాబా యజమాని చెల్లించారు.

## ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సమస్యలు పరిష్కరించాలి

**-సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.సాయిలు**



పిహెచ్‌సిలోని సమస్యలను రోగులను అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

**జోగిపేట, జూన్ 17, ప్రభాతవార్త:** మండలపరిధిలోని తాలెల్మ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని సమస్యలను పరిష్కరించాలని, 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.సాయిలు కోరారు. బుధవారం తాలెల్మ పిహెచ్‌సిలో ఆయన పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్‌పల్లి, అందోలు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇక్కడికి వైద్యం నిమిత్తం వస్తారని, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మందులు అందుబాటులో ఉంచాలని, వర్షాకాలంలో పాములు, తేళ్లకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. రోగులు ఎక్స్‌రే ల్యాబ్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అందోలు డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ పాల్గొన్నారు.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**-డిఎల్‌పిఓ సుధాకర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌పిఓ సుధాకర్‌రెడ్డి

**మనూర్, జూన్ 17, ప్రభాతవార్త:** తమ ఆరోగ్యాలు పదిలంగా ఉండేందుకు తమతమ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిఎల్‌పిఓ సుధాకర్‌రెడ్డి, ఎంపిడిఓ చంద్రశేఖర్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మనూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన పంచాయతీ కార్యదర్శులతో సమావేశంలో డిఎల్‌పిఓ, ఎంపిడిఓలు మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు సోకే అవకాశాలు ఉంటాయని, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా గ్రామస్థులకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు శరవేగంగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. బదిలీపై వెళుతున్న పంచాయతీ కార్యదర్శులను శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలుకగా బదిలీపై వచ్చిన కార్యదర్శులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపిడిఓ చంద్రశేఖర్, ఎంపిఓ హైమద్ హుస్సేన్, ఏపిఓ షాహిద్, సూపరింటెండెంట్ రఘు శేషు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ్‌రెడ్డిని కలిసిన నూతన కమిటీ సభ్యులు



ఆదర్శ్‌రెడ్డికి కమిటీపత్రాన్ని అందచేస్తున్న పాస్టర్స్, నూతనకమిటీ సభ్యులు

**రామచంద్రాపురం, జూన్ 17, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గ పాస్టర్స్, ఎవాంజలిస్ట్ నూతన కమిటీ సభ్యులు బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఇంచార్జి వెన్నవరం అదర్శ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని నూతన కమిటీగా ఎన్నికైనవారి వివరాల పత్రాన్ని అందచేశారు. కమిటీ కార్యక్రమాలకు సహకారం అందించాలని నూతనకమిటీ సభ్యులు ఆదర్శ్‌రెడ్డికి వినతిచేశారు. నూతన ఎగ్జిక్యూటివ్‌కమిటీ అధ్యక్షులుగా పాస్టర్ సుందర్‌రాజ్, ఉపాధ్యక్షులుగా పాస్టర్ దానియేలు, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ అమృత్‌రావు, కోశాధికారిగా పాస్టర్ జైరాజ్, సంయుక్త కార్యదర్శిగా పాస్టర్ సుధీర్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా పాస్టర్ వసంత రావు, పాస్టర్‌డేవిడ్‌లు నియమితులయ్యారు. కోర్ కమిటీ సభ్యులుగా పాస్టర్ సురేష్‌కుమార్, పాస్టర్ జాన్ ప్రభు, పాస్టర్ జగన్‌దాస్ (చైర్మన్), పాస్టర్ మాణిక్యం (వైస్ చైర్మన్), పాస్టర్ ఎలీషా (చీఫ్ అడ్వైసర్), పాస్టర్ అబ్రహం చెల్లప్ప (వర్కింగ్ ప్రెసిడెంట్), పాస్టర్ జేమ్స్ (రికార్డింగ్ సెక్రటరీ, లీగల్ అడ్వైసర్)లు కొనసాగనున్నారు. నూతనకమిటీ సభ్యులకు ఆదర్శ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. పాస్టర్, ఎవాంజలిస్ట్స్ సేవా కార్యక్రమాలకు తనవంతు పూర్తి సహకారం ఉంటుందని ఆదర్శ్‌రెడ్డి నూతన కమిటీ బాధ్యులకు హామీ చేశారు.

## బుదేరా సెలెస్టికా స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డిఈఓకు ఫిర్యాదు



డిఈఓకు వినతిపత్రం అందజేస్తున్న టీఆర్పి నాయకులు

**మునిపల్లి, జూన్ 17, ప్రభాతవార్త:** బుదేరా గ్రామంలోని సెలెస్టికా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘనలపై విచారణజరిపి, పాఠశాల గుర్తింపును రద్దుచేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు రవినాయక్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిపల్లి మండలం, బుదేరా గ్రామంలో ఉన్న సెలెస్టికా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శించడం జరిగిందన్నారు. పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికుల నుంచి పలు ఫిర్యాదులు అందాయన్నారు. పాఠశాల భవనం కింది అంతస్తులో వెల్డింగ్ షాపు, హోటల్ నిర్వహిస్తున్నారని దీనివల్ల అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలలో సరైన ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు కూడా లేవన్నారు. పాఠశాలకు సంబంధం లేని బస్సులను పాఠశాల పేరుమీద నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారన్నారు. అడ్మిషన్ ఫీజుల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేసి పేద, మధ్యతరగతి తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పాఠశాలలో సుమారు 281మంది విద్యార్థులు చదువుతుండగా కేవలం 3 టాయిలెట్లు, 3 యూరినల్స్ మాత్రమే ఉన్నాయి. ఇది విద్యాశాఖ నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు పాఠశాల యాజమాన్యమే పుస్తకాలు, యూనిఫాంలను బలవంతంగా విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే అర్హతలు లేని వ్యక్తులచే విద్యాబోధన చేయిస్తున్నారన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న సెలెస్టికా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌పై కఠిన చర్యలు తీసుకొని పాఠశాల గుర్తింపును రద్దుచేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిఈఓకు ఫిర్యాదు చేశారు.

## శ్రీకేతకి ఆలయానికి అన్నప్రసాదానికి విరాళం



ఆలయానికి అన్నప్రసాదానికి విరాళం అందచేస్తున్న దృశ్యం

**ఝరాసంగం, జూన్ 17, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీదేవి సమేతంగా కొలువున్న శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయానికి చేరుకునే భక్తులకు అన్నదాన ప్రసాదం అందచేసేందుకు నీల అశోక్ చంద్రకళ కుటుంబ సభ్యులు 5లక్షల రూపాయల చెక్కును బుధవారం అందచేశారు. శాశ్వత అన్నప్రసాద పథకానికై 5లక్షల విరాళాన్ని అందచేసిన భక్తులు ముందుగా ఆలయంలో ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## విద్యార్థులకు ఉపాధ్యాయుల ఘనస్వాగతం

**చిలిపిచెడ్, జూన్ 17, ప్రభాతవార్త:** గౌతపూర్‌గ్రామంలోని ప్రాథమిక ఉన్నతపాఠశాలలో సర్పంచ్ బలవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన విద్యాసంవత్సరంలో భాగంగా విద్యార్థులకు ఘనస్వాగతంపలికారు. ఈసందర్భంగా కొత్తగాచేరిన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను, యూనిఫాంలను సర్పంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైనవిద్య, ఉచితపాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నభోజనం వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వాన్, ఉపసర్పంచ్ నవాజ్, అంగన్‌వాడీ టీచర్స్, గ్రామస్థులు జిన్నాబాయ్, శ్యామ్, బ్రహ్మం, రహీం, శివ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యానికి హాజరైన తిరుపతిరెడ్డి

**పాపన్నపేట, జూన్ 17, ప్రభాతవార్త:** మండలపరిధిలోని రామతీర్థంగ్రామంలో జరిగిన ఒక గృహప్రవేశ కార్యక్రమానికి బిఆర్‌ఎస్ నాయకులు కంటారెడ్డి తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామసర్పంచ్ సాయిరెడ్డి తండ్రి మాణిక్యరెడ్డిని పరామర్శించారు. ఈసందర్భంగా సాయిరెడ్డితో మాట్లాడి మాణిక్యరెడ్డి ఆరోగ్య పరిస్థితిని, అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండలపార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలగౌడ్, రామతీర్థం సర్పంచ్ సాయిరెడ్డి, మాజీసర్పంచులు అనురాధబాబాగౌడ్, దుర్గయ్య, గురుమూర్తిగౌడ్, లింగారెడ్డి, శ్రీనాథ్ రావు, నాయకులు శ్రీనివాస్, నవీన్, స్వామి, చంద్రమోహన్‌గౌడ్, వినయ్, సాయి పాల్గొన్నారు.

## రైతులకు పెసర విత్తనాల పంపిణీ

**-డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్‌కుమార్**

**మనూర్, జూన్ 17, ప్రభాతవార్త:** రైతులు పంటమార్పిడి చేస్తూ పంటలను సాగుచేసుకుంటే అధిక దిగుబడులు అందుకుంటారని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్‌కుమార్ అన్నారు. మండలకేంద్రమైన మనూర్‌లోని రైతువేదికలో బుధవారం రైతులకు పెసర విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏడిఏ నూతన్‌కుమార్ మాట్లాడుతూ రైతులు భూసారపరీక్షలు చేయించుకుని ఫలితాలకు అనుగుణంగా పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారరి మహేష్ చౌహాన్, ఏఈఓలు ప్రవీణ్, స్రవంతి, సంధ్య, ప్రశాంత్, వెంకటేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## టిపిఎస్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయొద్దు

**-బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు**

**రామాయంపేట, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టిపిఎస్) పేరుతో గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడం తగదని, ప్రజల మానస పుత్రికలైన సర్కార్ బడులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 టిపిఎస్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, రెండున్నరేళ్లలో కేవలం ఒక పాఠశాల మాత్రమే ప్రారంభించింది. ఈ వేగంతో మిగిలిన 99 స్కూళ్ల పూర్తికావడానికి ఎంతకాలం పడుతుందో చెప్పాలి అని ప్రశ్నించారు. గత టిఆర్‌ఎస్ ప్రభుత్వం మానసపుత్రిక అంటూ ప్రచారం చేసిన కాళేశ్వరం పరిస్థితి ఏమైందో ప్రజలు చూస్తున్నారని, ప్రస్తుత సిఎం మానసపుత్రికగా చెబుతున్న టిపిఎస్ కూడా అలాగే మారుతుందేమోనని అనుమానం వ్యక్తంచేశారు. ఒక టిపిఎస్‌కు రూ.200 కోట్లు ఖర్చు చేసే బదులు, ఆ నిధులను మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు వినియోగిస్తే ప్రతి గ్రామ బడి నాణ్యమైన విద్యా కేంద్రంగా మారుతుంది. ప్రస్తుతం టిపిఎస్‌లో చేరుతున్నది కొత్త విద్యార్థులు కాదు, ఇప్పటికే సర్కార్ బడుల్లో చదివే పిల్లలే. దీంతో గ్రామీణ పాఠశాలలు మరింత బలహీనపడతాయని ఆవేదన వ్యక్తంచేశారు. సర్కార్ బడుల బలోపేతానికే ప్రాధాన్యం ఇవ్వాలని బిజెపి తరపున విజ్ఞప్తిచేశారు.

## మహిళాసమైక్య సంఘ భవనానికి ఎమ్మెల్యే భూమిపూజ

**నిజాంపేట్, జూన్ 17, ప్రభాతవార్త:** నిజాంపేట్ మండలం జంబికుంటలో మహిళాసమైక్య సంఘ భవనానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, రూ. 10లక్షలవ్యయంతో నిర్మిస్తున్న మహిళాసంఘ భవనం, సంఘంమీటింగ్, కార్యకలాపాలకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచ్ తాటిపల్లి బాల్లమ్మ, ఉపసర్పంచ్, రఘుపతిరెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

**సిర్గాపూర్, జూన్ 17, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధిబాటలో దూసుకుపోతున్నాయని కడపల్ సొసైటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలపరిధిలోని కడపల్‌గ్రామంలోని పోచమ్మ ఆలయం వెనుక గల్లీలో ఈజిఎస్ పథకంలో 5లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు సొసైటీ చైర్మన్ భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు పరమేశ్వర్, హనుమంతు, నారరాయణరెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌లో అంతరాయం..

**మనోహరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** మనోహరాబాద్ మండలంలోని ఇబ్రహీంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి ఫీడర్ ప్రాంతాల్లో నేడు (గురువారం) ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. లైన్లకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు పనుల కారణంగా ఈ కోత విధిస్తున్నట్టు ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని పరిశ్రమల యాజమాన్యాలు, వినియోగదారులు విద్యుత్ నిలిపివేతకు సహకరించాలని ఏఈ రాజ్ కుమార్ ప్రజలను కోరారు.

## అనుమతి తీసుకొని నిర్మాణం జరుపుతున్నాం

**నర్సాపూర్, జూన్ 17, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోని 6వ వార్డు ఖాజీగల్లీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణానికి మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి తీసుకొని నిర్మిస్తున్నామని ఇంటి యజమాని మహమ్మద్ అసనొద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేము నిర్మాణంచేస్తున్న ఇళ్లను కావాలని కొందరు ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నామని ఆరోపించడంలో ఎటువంటి నిజం లేదన్నారు. ఈ ఇళ్ల నిర్మాణంలో తనకు టెంట్‌హౌస్ దుకాణం ఉన్నందున టెంట్ హౌస్ సామగ్రి పెట్టడానికి విశాలంగా హాల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణాలు చూసి కొందరు ఫంక్షన్‌హాల్ అని అపోహపడ్డారని, దాంట్లో వాస్తవం లేదని ఆయన స్పష్టంచేశారు. అయితే కొందరు 1000 గజాల్లో ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నారని అనడంతో మున్సిపల్ అధికారులు వచ్చి కొలతలు చేయగా 423 గజాలు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు నిర్ధారించారని తెలిపారు.

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సాయికుమార్‌ను వివరణ కోరగా ఇళ్ల నిర్మాణ పనులు 1000 గజాల్లో నిర్మిస్తున్నారని వచ్చిన ఆరోపణల్లో నిజంలేదని అన్నారు. తమ సిబ్బంది అక్కడికి వెళ్లి విచారణ జరిపి కొలతలు చేయగా, ఇచ్చిన అనుమతుల కంటే 60గజాలు ఎక్కువ నిర్మిస్తున్నారని విచారణలో తేలిందన్నారు.

# శిథిలావస్థకు చేరిన వంగ్దల్ పంచాయతీ భవనం

## -వర్షం కురిస్తే అరచేతిలో ప్రాణాలతో విధుల నిర్వహణ




వంగ్దల్‌లో శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనం దృశ్యం

**సిర్గాపూర్, జూన్ 17, ప్రభాతవార్త:** మండలపరిధిలోని వంగ్దల్‌గ్రామంలోని పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం ఆరంభం కావడంతో వానలు కురుస్తున్న తరుణంలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బాధ్యతలు, విధులు నిర్వహించాల్సి వస్తోంది. భవనం పైకప్పు పెచ్చులు ఊడుతూ కింద పడిపోవడం, గోడలు పగుళ్లు రావడం, స్లాబ్‌లోని ఇనుప చువ్వలు బయటకు తేలి ఉండటం, వర్షం కురిస్తే వర్షపు నీరు భవనంలో కురుస్తుండటంతో కార్యాలయంలోని రికార్డులు తడిసిపోతున్నాయి.

**ప్రాణాభయంతో విధులు...**

పంచాయతీ భవనంలో గ్రామ సర్పంచ్ పాండు, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ పాలక వర్గం తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సిన దుస్థితి దాపురించింది. మరమ్మతు దిశలో ఉన్న పంచాయతీ భవనాన్ని కూల్చేసి కొత్తగా భవనాన్ని నిర్మించాలని పాలకవర్గంతో పాటు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. కొత్త భవనం నిర్మించేవరకు తాత్కాలికంగా మరో భవనంలో పంచాయతీ కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పల్లె ప్రగతి, ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ నిధులతో కొత్త భవనాన్ని నిర్మించాలని సర్పంచ్ పాండు, శంకర్‌రావు పాటిల్, సంతోష్‌రావు పాటిల్, భగవాన్‌రావు పాటిల్‌లు డిమాండ్ చేస్తున్నారు.